# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

వైబ్రెంట్ ఎడిషన్ 4pm

మంగళవారం 11-7-2023

teluguprabha.net -TeluguPrabha @TeluguPrabhaofficial


## ఏపీలో ప్రమాదం తెలంగాణవాసుల మృతి

**తెలుగుప్రభ, అమరావతి (జూలై 11)**

ఆంధ్రప్రదేశ్ విజయవాడ సమీపంలోని గన్నవరం వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు తెలంగాణకు చెందిన వారు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అతివేగమే ఈ ప్రమాదానికి గల కారణమని పోలీసులు భావిస్తున్నారు. మృతులు సూర్యాపేట జిల్లా చింతపాలెం గ్రామానికి చెందిన నాగుల్, మతిన్‌గా గుర్తించారు. మృతదేహాలను గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ ఇద్దరిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## లేటెస్ట్ న్యూస్

## తెలుగు ఫిల్మ్ ఛాంబర్ లో ఎన్నికల హడావిడి

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 11)**





తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికలకు హడావిడి మొదలైనట్లు కనిపిస్తోంది. షెడ్యూల్ విడుదల కావడంతో పోటీకి సిద్ధమవుతున్నారు ఆశావహులు. జూలై 14 కి నామినేషన్స్ కి ఆఖరు తేదీ కాగా.., నామినేషన్ విత్ డ్రా కు ఆఖరి తేదీగా జూలై 21 అని షెడ్యూల్‌లో ప్రకటించారు. జూలై 30న ఎన్నికలు జరగనున్నాయి. ఈ సారి బరిలో ప్రముఖ నిర్మాతలు ఉండనున్నట్లు తెలుస్తోంది. అధ్యక్ష పదవి కోసం సి కల్యాణ్, దిల్ రాజు పోటీ పడనున్నట్లు సమాచారం. ప్రస్తుతం కె.బసిరెడ్డి చాంబర్ అధ్యక్షుడిగా ఉన్నారు.

# ఉలిక్కిపడ్డ దోమలగూడ

### సిలిండర్ బ్లాస్ట్.. ఏడుగురికి తీవ్రమైన గాయాలు

**తెలుగుప్రభ, దోమలగూడ (జూలై 11)**



గ్యాస్ సిలిండర్ బ్లాస్ట్‌తో హైదరాబాద్‌లోని దోమలగూడ ఈ ప్రమాదంలో ఏడుగురికి తీవ్ర గాయాలవ్వగా.. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో గ్యాస్ లీకైంది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇంటి మొత్తానికి వ్యాపించాయి. ఈ ఘటనలో ఇల్లు దగ్ధమవ్వగా.. ఇంట్లోని ఏడుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడినవారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంట్లో నుంచి మంటలు, దట్టమైన పొగలు రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఫైరింజన్ల సహాయంతో మంటలను ఆర్పివేశారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లలో ఆస్పత్రికి తరలించారు. గ్యాస్ లీకేజీ ప్రమాదంలో పద్మ(55), ఆమె కూతురు ధనలక్ష్మి (30) ధనలక్ష్మి పిల్లలు అభినవ్ (8), శరణ్య (6), విహార్ (3), పద్మ చెల్లెలు నాగులు గాయపడ్డారు. వీరికి ప్రస్తుతం గాంధీ హాస్పిటల్ డాక్టర్లు చికిత్స అందిస్తున్నారు. అయితే బోనాల పండుగ సందర్భంగా ధనలక్ష్మి పిల్లలతో కలిసి పుట్టింటికి వచ్చింది అయితే అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడున్నారు. ఈ అగ్నిప్రమాదంతో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఎంత నష్టం జరిగిందనే దానిపై అంచనా వేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ లీక్ అవ్వడంతోనే ఈ అగ్నిప్రమాదం సంభవించినట్లు గుర్తించారు.

**అవి రేవంత్ రెడ్డి సొంత వ్యాఖ్యలో.. పార్టీలో చర్చకొచ్చిన అంశమో తెలీదు కానీ.. అమెరికాలో ఆయన చేసిన వ్యాఖ్యలు తెలంగాణలో మంట రేపుతున్నాయి. అధికార పార్టీ నుంచే కాదు.. సొంత పార్టీ కాంగ్రెస్ నుంచే ఆయనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవసరమైన సీతక్కను తెలంగాణ సీఎం చేస్తానని వ్యూహాత్మకంగా వ్యవహరించిన రేవంత్.. ఈ రోజు ఉచిత కరెంట్‌పై నర్మగర్భ వ్యాఖ్యలు చేసి సెల్ఫ్ గోల్ వేసుకున్నారు. రేవంత్ తీరుపై కాంగ్రెస్ పెద్దలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఇలాంటి ప్రకటనలు చేసేందుకు రేవంత్ ఎవరని కాంగ్రెస్ సీనియర్లు ప్రశ్నిస్తున్నారు.**



# కాంగ్రెస్‌లో కరెంట్ హీట్

- రేవంత్ వ్యాఖ్యలపై సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు
- తప్పే అంటున్న సీనియర్లు
- మరో వైపు నిరసనలకు సిద్ధమైన బీఆర్ఎస్
- కేటీఆర్ పిలుపుతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు

## అసలు రేవంత్ ఏమన్నారంటే..

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 11)**

"మేం అధికారంలోకి వస్తే వ్యవసాయానికి 8 గంటలు మాత్రమే కరెంట్ ఇస్తాం. ఒక ఎకరానికి నీళ్లు పట్టాలంటే ఒక గంట సరిపోతుంది. అలాంటప్పుడు 24 గంటల ఉచిత కరెంట్ ఎందుకు. " అంటూ టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయానికి నిరంతరాయ కరెంట్, రైతుబంధు పథకాలను కొనసాగిస్తారా? లేదా? అని అమెరికాలో ఎన్ఆర్ఐలు అడిగిన ప్రశ్నలకు ఈ మేరకు తన మనసులోని మాటను రేవంత్ రెడ్డి బయటపెట్టారు. 'ఒక ఎకరానికి నీళ్లు పట్టాలంటే ఒక గంట చాలు.. మూడెకరాలకు ఫుల్లుగా నీళ్లు పట్టాలంటే మూడు గంటలు చాలు.. అంటే రోజుకొక 8 గంటలు కరెంట్ ఇస్తే సరిపోతుంది.' అని రేవంత్ రెడ్డి అన్నారు.



### రైతులు, ప్రజాప్రతినిధులు భగ్గు

రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తెలంగాణ ప్రజలు, రైతులు భగ్గుమన్నారు. వ్యవసాయ రంగాన్ని కుదేలు చేసేలా కాంగ్రెస్ నిర్ణయాలు ఉన్నాయని మండిపడుతున్నారు. ఉచిత కరెంట్‌పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీలోనూ కలవరం మొదలైంది. కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ పార్టీ కాదు.. జాతీయ పార్టీ.. ఏవైనా నిర్ణయాలు తీసుకోవాలంటే.. మా జాతీయ నాయకత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఆ అధికారం రేవంత్ రెడ్డికి లేదని సీనియర్లు తేల్చిచెప్పారు.

ఉచిత విద్యుత్ విషయంలో రేవంత్ మాట్లాడింది తప్పే అని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. తాను, రేవంత్ కేవలం కో ఆర్డినేటర్స్ మాత్రమే అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఏది చెబితే అది ఫైనల్ అవుతుందా? అంటూ కోమటిరెడ్డి ప్రశ్నించారు. కోమటిరెడ్డితో పాటు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను పలువురు నేతలు తప్పుబట్టారు.



### రేవంత్ రెడ్డికి ఎందుకంత కండ్ల మంట

ఉచిత కరెంట్ సరఫరాపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రైతుల ఆర్థిక పురోభివృద్ధి నచ్చని రేవంత్ రెడ్డికి ఎంత కండ్ల మంట ఉందో అర్థమవుతుందన్నారు. సీఎం కేసీఆర్ రైతులకు కొండంత అండగా నిలిచి అన్ని విధాలుగా ఆదుకుంటుంటే, కాంగ్రెస్ పార్టీ మాత్రం రైతుల పొట్టగొట్టేందుకు చూస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్, టీడీపీ పాలనలో కరెంటు లేక రైతులు అరిగోసపడ్డారని, స్వరాష్ట్రంలో పుష్కలంగా సాగునీరు, నాణ్యమైన నిరంతర కరెంట్ సరఫరాతో ఆర్థికంగా ఎదుగుతున్న రైతులను మళ్లీ చీకట్లోకి నెట్టేసే కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలను ప్రజలు తిప్పికొడతారని హెచ్చరించారు. మొదటి నుంచి కాంగ్రెస్‌కు రైతులంటే చిన్నచూపని, మొన్న ధరణి వద్దన్నారని, ఇప్పుడు చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే.. కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ అని అర్థమవుతుందని వ్యాఖ్యానించారు.



### చంద్రబాబు వారసుడు రేవంత్..

ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సరిపడా సాగునీరు, ఉచిత విద్యుత్, పంటపెట్టుబడి వంటి పథకాల అమలుతో తెలంగాణ రైతాంగం ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నదని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. గతంలో వ్యవసాయం దండుగ అని చంద్రబాబు అన్నాడని, ఆయన వారసత్వాన్ని రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నాడని విమర్శించారు. చంద్రబాబు వెళ్లిపోయినా ఆయన నీడలు, జాడలు తెలంగాణలో మిగిలే ఉన్నాయని రేవంత్ వ్యాఖ్యలతో తేలిపోయిందన్నారు. 2004 పరిస్థితులను 20 ఏండ్ల తర్వాత గుర్తుకుతెచ్చుకోవాల్సిన దౌర్భాగ్యం ఏర్పడిందని చెప్పారు. అసలు పీసీసీ చీఫ్‌కు వ్యవసాయంపై అవగాహన ఉందా అని ప్రశ్నించారు.

## ఎన్ఆర్ఐలు అభివృద్ధి సారథులు : ఎర్రబెల్లి



తెలుగుప్రభ, న్యూఢిల్లీ (జూలై11): ఎన్ఆర్ఐలు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సారథులు కావాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆకాంక్షించారు. విభజన తర్వాత రెండు రాష్ట్రాల్లో అప్రతిహత అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను ప్రపంచ పటంలో నిలిపేలా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. అమెరికాలోని పెన్సిల్వేనియాలో జరుగుతున్న తానా మహాసభలకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫిలడెల్ఫియాలో ఉన్న సాయిదత్త ఆలయాన్ని దర్శించారు. సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. తానా మహాసభలు అత్యంత వైభవోపేతంగా జరిగాయన్నారు. తమకు ఆతిథ్యం ఇవ్వడానికి అమెరికా నలుమూలల నుంచి వచ్చిన తెలుగు ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మనం ఎక్కడున్నా దేశ భక్తిని, కన్న తల్లిని, పుట్టిన ఊరిని మరచిపోలేదని చెప్పారు. మన పనితనంతో వలస వెళ్లిన దేశం, స్వదేశానికి, రాష్ట్ర, గ్రామ అభివృద్ధికి చోదక శక్తులుగా ఉన్నామన్నారు. దేశ సంపద పెంపులో, నిర్మాణంలో మనమే ముందున్నామని వెల్లడించారు. భవిష్యత్తులో ఇది మరింతగా కొనసాగాలని సూచించారు. దేశాల మధ్య వారధులుగా, అభివృద్ధి సారథులుగా నిలవాలని చెప్పారు.

## ఘజియాబాద్‌లో ఘోర ప్రమాదం
# ఆరుగురి దుర్మరణం

**తెలుగుప్రభ, న్యూఢిల్లీ (జూలై11):**



ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్ లో విషాదం చోటుచేసుకుంది. పాఠశాల బస్సు, కారు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం చెందారు. మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘటనతో ఆయా కుటుంబాల్లో విషాదచాయలు అలుముకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి... ఢిల్లీలోని ఘాజీపూర్ నుంచి రాంగ్ రూట్ లో వెళ్తున్న పాఠశాల బస్సు.. అదే సమయంలో మీరట్ నుంచి గురుగ్రామ్ వైపు వెళ్తున్న ఎస్‌యూవీ కారును ఢీ కొట్టినట్లు ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామానంద్ కుష్వా తెలిపారు. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. ఎనిమిదేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు.





## ఏపీ సీఎం జగన్ పై రాజాసింగ్ ఫైర్

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 11)**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై తెలంగాణలోని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమలలో పురాతన మండపాన్ని కూల్చే ప్రయత్నంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మండపాన్ని కూల్చటమంటే హిందువుల మనోభావాలను దెబ్బతీయటమే అన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతింటే.. సీఎం జగన్ కాలర్ పట్టుకుని నిలదీస్తామని ధ్వజమెత్తారు. తిరుపతి ఆంధ్రులది మాత్రమే కాదని, దేశంలోని భారతీయులు అందరిదీ అని జగన్ గుర్తించుకోవాలని సూచించారు. శ్రీకృష్ణ దేవరాయలు నిర్మించిన మండపాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి కోరారు.